ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 10 నవంబరు 2025



పడకేసిన పాలన

గొలుగొండ మండలంలో ఆరు ముఖ్య శాఖల అధికారుల కుర్చీలు ఖాళీ

- పక్క మండలం తహశీల్దారు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలకు ఇన్‌చార్జి బాధ్యతలు
- ఎంపీడీవో, హౌసింగ్ ఏఈలుగా కిందిస్థాయి ఉద్యోగులు..
- ఎంఈవోగా వేరే మండలంలోని ఓ హైస్కూల్ హెచ్‌ఎం!
- పీఆర్ జేఈ లేకపోవడంతో పెండింగ్‌లో 'ఉపాధి' బిల్లులు
- సకాలంలో సేవలు అందక ప్రజాప్రతినిధులు, ప్రజల ఇక్కట్లు



ఖాళీగా ఉన్న తహశీల్దారు ఛాంబర్ (ఇన్‌సెట్‌లో) తహశీల్దారు కార్యాలయం

గొలుగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

మండలంలో ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఆరు శాఖలకు అధికారులు లేరు. నెలల తరబడి ఆయా పోస్టుల్లో ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు. ప్రధానంగా మండలానికి పెద్ద దిక్కు అయిన తహశీల్దారు, ఎంపీడీవో పోస్టుల్లో కూడా రెగ్యులర్ అధికారులు లేకపోవడం విశేషం. ఇంకా ఎంఈవో, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, పంచాయతీరాజ్ జేఈ పోస్టుల్లో సైతం ఇన్‌చార్జిలే వున్నారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన పనులు మందగిస్తున్నాయి. ఇన్‌చార్జి అధికారులు ఇక్కడ పూర్తిస్థాయిలో సమయం కేటాయించకపోవడంతో ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు సైతం ఇబ్బంది పడుతున్నారు. సమస్యలను అధికారులకు చెప్పుకుందామని మండల కేంద్రానికి వస్తే.. ఆయా కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

తహశీల్దారు శ్రీనివాసరావు రెండు నెలల క్రితం పదవీ విరమణ చేశారు. జిల్లా అధికారులు ఇక్కడ మరొకరిని నియమించకుండా నర్సీపట్నం తహశీల్దారు రామారావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన గొలుగొండకు ఎప్పుడో వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎంపీడీవో మేరీరోజీ పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఆమె నర్సీపట్నం డీఎల్‌పీవో కార్యాలయానికి సరెండర్ చేశారు. ఇక్కడ ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న బాబూరావుకు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు.

గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి ఏఈగా మూడున్నరేళ్లపాటు నాతవరం మండలం ఏఈ పనిచేశారు. ఇటీవల ఆయనకు బదిలీ కావడంతో కృష్ణాదేవిపేట సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ... మిగతా 6వ పేజీలో

పేదల ఇళ్ల లేఅవుట్లలో దొంగలు

రాత్రిపూట భవన నిర్మాణ సామగ్రి చోరీ

- ఎన్టీఆర్ కాలనీల నుంచి ఇసుక, ఇనుము, సిమెంటు తీసుకుపోతున్న అక్రమార్కులు
- ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలు, లారీ లోడు రూ.8 వేలకు అమ్మకం
- పట్టించుకోని అధికారులు



నంగినారపాడులో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సబ్బవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని పలు గ్రామాల్లో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఎన్టీఆర్ నగర్ కాలనీల (నాడు జగనన్న కాలనీలు) లే-అవుట్లలో భవన నిర్మాణ సామగ్రిని యథేచ్ఛగా చోరీ చేస్తున్నారు. ఇసుక, సిమెంటు, ఇనుము, కంకర వంటి వాటిని దర్జాగా పట్టుకుపోతున్నారు.

మండలంలోని పైడివాడ, పైడివాడఅగ్రహారం, ఎరుకునాయుడుపాలెం, అసకపల్లి, గాలిభీమవరం, గొల్లలపాలెం, నంగినారపాడు, గంగవరం గ్రామాల్లో వైసీపీ హయాంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరిట జీవీఎంసీ పరిధిలోని పేదలకు స్థలాలతోపాటు ఇళ్లు నిర్మించిన ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కొక్కరికి ఒక సెంటు చొప్పున ఆయా గ్రామాల్లో ఎనిమిదిచోట్ల లే-అవుట్లు వేశారు. 2022 ఏప్రిల్ 28న అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి పైడివాడఅగ్రహారం లే-అవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించుకోవడం కష్టం అన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఇందుకుగాను ప్రతి లబ్ధిదారు నుంచి ... మిగతా 6వ పేజీలో



కాలనీల్లో చోరీ చేసి అసకపల్లి సమీపంలో నిల్వ చేసిన ఇసుక

గోవాడ రైతు ఘోష

రూ.29 కోట్ల మేర చెరకు బకాయిలు

- కార్మికులకు మరో రూ.10 కోట్లు...
- చెల్లింపులపై నోరుమెదపని ఫ్యాక్టరీ యాజమాన్యం
- ప్రభుత్వం నుంచి కొరవడిన స్పందన
- ఈ ఏడాది చెరకు క్రషింగ్‌కు మంగళం
- సంకిలిలో ప్రైవేటు ఫ్యాక్టరీకి సరఫరాకు ఆదేశాలు
- ధర, చెల్లింపులు, రవాణా ఖర్చులపై స్పష్టత ఇవ్వని అధికారులు
- దిక్కుతోచని చెరకు రైతులు, కార్మికులు



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత సీజన్‌లో క్రషింగ్ చేయడంలేదని యాజమాన్యం ప్రకటించడంతోపాటు ఫ్యాక్టరీ పరిధిలోని చెరకును శ్రీకాకుళం జిల్లా సంకిలిలోని జీఎంఆర్ షుగర్ ఫ్యాక్టరీకి అప్పగిస్తూ, ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. కానీ గత సీజన్‌లో సరఫరా చేసిన చెరకుకు సంబంధించి బకాయిల చెల్లింపుపై స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గోవాడ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై భరోసా ఇవ్వకపోగా, గత సీజన్‌లో ఫ్యాక్టరీకి తోలిన చెరకుకు ఇంతవరకు డబ్బులు చెల్లించకపోవడం దారణమని రైతులు వాపోతున్నారు.



చెరకు తోట

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో 2023-24, 2024-25 క్రషింగ్ సీజన్‌లకు సంబంధించి సభ్య రైతులకు చెరకు బకాయిలు రూ.28 కోట్లు, రవాణా ఛార్జీలు రూ.కోటి కలిపి సుమారు రూ.29 కోట్లు చెల్లించాల్సి వుంది. ఇక కార్మికులకు ఆరు నెలల వేతన బకాయిలు, పదవీ విరమణ చేసిన సిబ్బందికి చెల్లించాల్సిన వివిధ రకాల ప్రయోజనాలు కలిపి సుమారు రూ.10 కోట్లు వుంటాయి. ప్రస్తుతం ఫ్యాక్టరీలో వున్న పంచదార, మొలాసిస్ నిల్వల విలువ రూ.6 కోట్లకు మించి వుండదు. చెరకు రైతులకు, ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిల చెల్లించాలంటే మరో రూ.35 కోట్లు అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ఆప్కాబ్‌తోపాటు ఏ బ్యాంకు కూడా షుగర్ ఫ్యాక్టరీకి రుణం ఇచ్చే పరిస్థితి లేదు. ఇక భారమంతా ప్రభుత్వంపైనే వుంది. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు.

చెరకు తరలింపుపై స్పష్టత ఇవ్వని షుగర్స్ యాజమాన్యం

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ జరగదని స్పష్టం చేయడంతోపాటు ఇక్కడి చెరకును శ్రీకాకుళం జిల్లా సంకిలిలోని జీఎంఆర్ షుగర్ ఫ్యాక్టరీకి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీనిఇపై 'గోవాడ' యాజమాన్యం నుంచి ఇంతవరకు సమాచారం లేదని రైతులు అంటున్నారు. గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 70 వేల టన్నుల చెరకు దిగుబడి వస్తుందని అంచనా. సంకిలి ఫ్యాక్టరీ ఎంత ధర చెల్లిస్తుంది? చెరకు సరఫరా చేసిన తరువాత ఎన్ని రోజుల్లో డబ్బులు చెల్లిస్తారు? చెరకు రవాణా ఛార్జీలు ఎవరు భరించాలి? వంటి వాటిపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో గందరగోళం నెలకొంది.

రైతులు, కార్మికుల బకాయిలు తీర్చండి

చెరకు రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కష్టకాలంలో రైతులను ఆదుకోవాలి. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి ఆర్థిక సాయం అందించి క్రషింగ్ జరిగేలా చూడాలి. గోవాడ షుగర్స్‌ను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

దండుపాటి తాతారావు,
గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి నేత

వానరమూకతో బెంబేలు

ఎలమంచిలి వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులు

- ఇళ్లల్లోకి చొరబడి సామగ్రి ధ్వంసం
- అడ్డుకుంటే మూకుమ్మడిగా దాడి
- భయాందోళన చెందుతున్న పిల్లలు, మహిళలు, వృద్ధులు
- పట్టించుకోని మునిసిపల్, అటవీ శాఖల అధికారులు



కొత్తపేటలోని ఒక వీధిలో సంచరిస్తున్న కోతులు

ఎలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో వానన మూకల బెడద నానాటికీ పెరిగిపోతున్నది. కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆ వీధి.. ఈ వీధి.. అన్న తేడా లేకుండా అన్నిచోట్లా స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు ఇంటి నుంచి వీధిలోకి రావాలంటే భయపడుతున్నారు. వీటి ఆగడాలు నానాటికీ శ్రుతి మించుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో సుమారు ఆరేళ్ల నుంచి కోతుల బెడద వున్నప్పటికీ అధికారులు, మునిసిపల్ పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పిల్లలు, పెద్దవి కలిపి పది నుంచి ఇరవై వరకు కోతులు ఇళ్లలోకి చొరబడి సామగ్రిని పాడు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎవరైనా వారించడానికి సాహసం చేస్తే మూకుమ్మడిగా దాడిచేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలోని రామ్‌నగర్, మిల్ట్రీ కాలనీ, నాగేంద్ర కాలనీ, కొత్తపేట, ఏఎస్ఆర్ కాలనీ, కోర్టుపేట, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో కోతుల సంచారం అధికంగా వుంది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం మునిసిపల్ అధికారులు పట్టణంలో కోతుల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టారు. కొంతకాలంపాటు వీటి బెడద లేదు. తరువాత క్రమేణా మళ్లీ కోతుల రాక పెరిగింది. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కోతులను పట్టించి అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టాలి. కానీ ఈ విషయంలో మునిసిపల్ ... మిగతా 6వ పేజీలో

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల దుర్మరణం

- గోకులపాడు, లింగరాజుపాలెం వద్ద ఘటనలు
- ఒకరిది ఎలమంచిలిలోని పెదపల్లి, మరొకరిది ఎస్.రాయవరం



ఊడి రంజిత్‌కుమార్ (ఫైల్ ఫొటో)



గింజాల హరీశ్ (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారిపై మండలంలోని గోకులపాడు, లింగరాజుపాలెం గ్రామాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతిచెందారు. వీరిలో ఒకరు వ్యవసాయ కూలీకాగా మరొకరు చిరుద్యోగి. ఈ సంఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని పెదపల్లికి చెందిన ఊడి రంజిత్‌కుమార్ (28) వ్యవసాయ కూలీ పనులకు వెళుతుంటాడు. ఆదివారం ఉదయం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై కాకినాడ జిల్లా తుని మండలంలోని ... మిగతా 6వ పేజీలో

డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక పాఠాలు

ఐఐఎంలో నిర్వహణకు సన్నాహాలు

- ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం
- ఇప్పటికే ఉన్నత విద్యా మండలి, యాంఫీతో ఒప్పందం
- ఏటా 20 వేల మందికి అందనున్న శిక్షణ
- తొలి దశలో అధ్యాపకులకు వచ్చే నెల 13 నుంచి ప్రారంభం



గంభీరంలోని ఐఐఎం సెంటర్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులకు ఆర్థిక అంశాలపై (పెట్టుబడి పెట్టే మార్గాల)పై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఇప్పటికే భారత్ అభివృద్ధి చెందిన ఆర్థిక దేశాల జాబితాలో కీలక స్థానానికి చేరుకుంది. అగ్రస్థానానికి చేరుకునే దిశగా నిర్ణయాలను తీసుకుంటోంది. ఆ స్థాయికి ఎదగాలంటే ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత (అవగాహన) అవసరమని నిపుణులు చెబుతున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ ఆఫ్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) నిర్ణయించాయి. ఈ మేరకు ఐఐఎంతో ఒప్పందం చేసుకున్నాయి.

భవిష్యత్తులో పెట్టుబడులుపెట్టే వర్గాలుగా మారనున్న విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు వీలుంటుందని ఏఎంఎఫ్ఐ భావించింది. ఈ నేపథ్యంలోనే దేశంలోనే తొలిసారిగా విద్యార్థులకు ఆర్థిక పాఠాలు బోధించేందుకు సిద్ధమైంది. విద్యార్థులకు శిక్షణ అందించేందుకు విశాఖలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)తో రాష్ట్ర ప్రభుత్వం, ఏఎంఎఫ్ఐ ఎంవోయూ చేసుకున్నాయి.

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ..

అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) దేశంలోని అన్ని సెబీ నమోదిత మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన లాభాపేక్ష లేని, స్వీయ నియంత్రణ కలిగిన సంస్థ. మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీని వృత్తిపరంగా, నైతికంగా అభివృద్ధిచేయడం, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడడం, పారదర్శకతను ప్రోత్సహించడం దీని ప్రధాన కార్యకలాపాలు. ఈ సంస్థ ప్రధానంగా మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన కల్పించేందుకు, పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంపొందించేందుకు కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈమేరకు సామాజిక మాధ్యమాలు, ఇతరమార్గాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. అయితే, వీటివల్ల ఆశించినస్థాయిలో ఫలితాలు రావడం లేదని భావించిన సంస్థ ఇతర మార్గాలను అన్వేషించింది. ఈ క్రమంలో ప్రజలకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఆసక్తిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఆర్థిక అంశాలపై శిక్షణ అందిస్తే, భవిష్యత్తులో వారికి పెట్టుబడి పెట్టే మార్గాలపై స్పష్టమైన అవగాహన కలుగుతుందని అంచనా వేసింది.

ఈ అంశాలపై..

ఫైనాన్షియల్ లిటరీ ప్రోగ్రామ్ ఫర్ డిగ్రీ కాలేజీ ... మిగతా 6వ పేజీలో

నూకాంబికను దర్శించుకున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్ జీఎం

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా నూతనంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వేజోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ అంకుష్ గుప్తా దంపతులు ఆదివారం అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో కేఎల్ సుధారాణి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాలాలయంలో పూజలు చేసిన అనంతరం రైల్వే ఉన్నతాధికారులను సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.



దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ అంకుష్ గుప్తా దంపతులకు నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను

ఆశాలను పర్మనెంట్ చేయాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్
- ముగిసిన రాష్ట్ర మహాసభలు



సభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి



హాజరైన ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. రెండు రోజుల నుంచి ఇక్కడ జరుగుతున్న యూనియన్ ఐదవ రాష్ట్ర మహాసభలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న ప్రధాన డిమాండ్లపై పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించాలని, ఆశా వర్కర్ల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం అంగీకరించిన అంశాలపై వెంటనే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్మికుల పని గంటలను పెంచి శ్రమదోపిడీని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని ధ్వజమెత్తారు. మహాసభల్లో వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్. రూపాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ... మిగతా 6వ పేజీలో



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పరమేశ్వరరావు

బీజేపీలో పలువురి చేరిక

అచ్యుతాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం, రామన్నపాలెం, దిబ్బపాలెం గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం బీజేపీలో చేరారు. వారందరికీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పనితీరుకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరటానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. త్వరలో గ్రామీణ స్థాయిలో పార్టీ కేడర్‌ను విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొరుప్రోలు చిన్నారావు, గొంతిన భక్త సాయిరాం, అగ్గాల హనుమంతరావు, కూండ్రపు నాయుడుబాబు, పల్లి రాజుబాబు, శీరం చిరంజీవి, ఎం.కాసుబాబు, రామ్మోహనరావు, సురేశ్ పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



వృద్ధునికి కంటి అద్దాలు పెడుతున్న దొరస్వామి

అచ్యుతాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 620 మంది హాజరుకాగా, వీరిలో 450 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 330 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు. 145 మందికి మందులు పంపిణీ చేశారు. 45 మందికి కంటికి శస్త్రచికిత్సలు చేయించాలని వైద్య బృందం నిర్ణయించారు. విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని బ్రాండిక్స్ భాగస్వామి దొరస్వామి తెలిపారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తీర్థం

రాంబిల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురంలో ఆదివారం అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మండల స్థాయిలో పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెల్చూరులో కార్తీక మహోత్సవాలు

రాంబిల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు ఉమానాగలింగేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం కార్తీక మహోత్సవాలను నిర్వహించారు. వేద పండితులు జయంతి మురళీశర్మ ఆధ్వర్యంలో పురోహితుల బృందం అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. మధ్యాహ్నం భారీగా కార్తీక వనభోజనాలు కార్యక్రమంనిర్వహించారు. రాంబిల్లి మండల పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని పూజించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆనంద్, చంటి, స్థానిక నాయకులు నాగరాజు, రమేశ్‌రాజు తదతరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో వైభవంగా బండిమాంబ జాతర

భక్తులతో కిక్కిరిసిపోయిన అమ్మవారి ఆలయం





బండిమాంబ ఆలయం వద్ద క్యూల్లో ఉన్న భక్తులు... అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు, కూటమి నేతలు

ఎలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక బండిమాంబ జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం తెల్లవారు నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో క్యూ లైన్లు నిండిపోయాయి. అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కాండ్రకోట చిరంజీవి, టీడీపీ, జనసేన నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ కరణం దర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే యూవీ. రమణమూర్తిరాజు, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ, మండల అధ్యక్షులు బొద్దపు యర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, కోఆప్షన్ సభ్యుడు నరసింహమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలు, పురవీధులు విద్యుత్ కాంతులతో మెరిసిపోయాయి. నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేందుకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామానికి చేరుకునే ప్రధాన రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. భారీ ఎత్తున మందుగుండు సామగ్రి పేల్చడం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అలాగే అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుతో పాటు కూటమి నేతలు దర్శించుకున్నారు. వారికి కమిటీ ప్రతినిధులు నేతలకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పట్టణ అధ్యక్షులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, కూటమి నాయకులు అన్నం వెంకట్రావు, కరణం రవి, బొద్దపు రమణ, మోటారు గోపీనాథ్, ముప్పిన కృపారావు, ఎస్.తులసీరామ్, సేనాపతి రాజామహేశ్ పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శ్యామ్‌కు ఏపీఆర్డీసీ డైరెక్టర్ పదవి

అచ్యుతాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురానికి చెందిన బొందల శ్యామ్ ఆదివారం రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి చేపట్టారు. విజయవాడలోని ఏపీఆర్డీసీ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువతి ఆత్మహత్యాయత్నం

- ప్రియుడితో పెళ్లి చేయలేదనే మనస్తాపం
- ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు

గాజువాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వాడితో పోలీసులు పెళ్లి చేయలేదనే మనస్తాపంతో ఓ యువతి గాజువాక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి చెందిన యువతి, అనకాపల్లికి చెందిన వీరయ్యస్వామి అచ్యుతాపురంలోని ఓ సంస్థలో పనిచేసేవారు. ఈ క్రమంలో వారిద్దరిమధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. కొంతకాలం తరువాత యువతి అచ్యుతాపురంలో పని మానేసి గాజువాకలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తూ శ్రీనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఏడేళ్ల పాటు కలిసి తిరిగిన వీరయ్యస్వామి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో పది రోజుల కిందట గాజువాక పోలీసులను ఆశ్రయించింది. దీనిపై ఆదివారం పోలీసులు ఇద్దరినీ పిలిపించారు. ఈ క్రమంలో యువతి వీరాస్వామితో తనకు పెళ్లి చేయాలని పట్టుబట్టింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తుండగానే హ్యాండ్‌బ్యాగ్‌లోని నెయిల్ పాలిష్ తీసుకుని తాగేసింది. వెంటనే పోలీసులు ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాజువాక సీఐ ఎ.పార్థసారధి ఆస్పత్రికి వెళ్లి యువతిని విచారించారు. అయితే ప్రియుడిపై ఫిర్యాదు చేయడానికి ఆమె నిరాకరించి, పెళ్లి చేయాలని మాత్రమే పట్టుబడుతుండడంతో వీరయ్యస్వామితో చర్చిస్తున్నారు.

ఉత్సాహంగా హ్యాపీ సండే



ప్రతిభావంతులకు మెడల్స్ అందిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, వైస్ చైర్మన్ ఆరైపు గుప్తా, కమిషనర్ ప్రసాదరాజు సమక్షంలో చిన్నారులు దేశభక్తిని పెంపొందించేలా చేసిన స్కిట్‌లు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు ప్రతీ వారం వార్డుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ రమాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ కమిటీ డైరక్టరు గుర్రాల శేఖర్, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు బీబీ, వైసీపీ నేత త్రినాథ్, టీడీపీ నేత కె.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఎలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 1992-93 బ్యాచ్‌లో పదో తరగతి విద్యార్థులంతా కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యా బుద్ధులు నేర్పిన పాఠశాలకు తమ వంతు తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగావారివీధిలో యువతి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. తన కుమార్తె 45 రోజులుగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నదని, ఈ నెల 8వ తేదీన సాధారణంగా విధులకు వెళ్లి రాత్రి 7.40 గంటలకు తనకు ఫోన్ చేసి ఇప్పుడే బయలుదేరుతున్నానని చెప్పిందని, తర్వాత ఇంటికి రాలేదని యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

విద్యార్థి దశలోనే క్రీడల్లో రాణించాలి

- మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే క్రీడల్లో రాణించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి సూచించారు. పట్టణంలోని భాష్యం పాఠశాల ఆవరణలో ఆదివారం కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలకు ఆత్మరక్షణ విభాగంలో కూడా అవగాహన అవసరమన్నారు. గ్రేడింగ్ పరీక్షల అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులతో పాటు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేముడుబాబు, బీజేపీ కోకన్వీనర్ నక్కా శివశంకర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల లేఅవుట్లలో దొంగలు

... 5వ పేజీ తరువాయి

రూ.35 వేల చొప్పున ప్రభుత్వం వసూలు చేయించింది. కానీ కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేయడంతోపాటు తీవ్ర జాప్యం చేశారు. గత ఏడాది ప్రభుత్వం మారేనాటికి ఎక్కడా ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు. అప్పటి ప్రభుత్వం బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణ పనులను మధ్యలో ఆపేశారు. దీంతో కొంతమంది స్థానికులు సిమెంటు, ఇసుక, ఇనుము, కంకరను తస్కరించుకుపోయారు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల నిర్మాణ పనులు మళ్లీ మొదలయ్యాయి. కాలనీలను త్వరగా నిర్మించాలన్న ఉద్దేశంతో ఇసుక, ఇనుము, కంకర, సిమెంటును పెద్ద మొత్తంలో సరఫరా చేస్తున్నది. వీటిని కాలనీల్లో పలచోట్ల డంపింగ్ చేస్తున్నారు. రక్షణ కోసం సెక్యూరిటీ గార్డులను నియిమించలేదు. దీంతో అక్రమార్కులు మళ్లీ బరితెగించారు. చీకటి పడిన తరవాత సిమెంటు, ఇసుక, ఇనుము, కంకరను ఎత్తుకుపోతున్నారు. సమీపంలోని తోటలు, ప్రైవేటు లేఅవుట్లలోకి తరలించి నిల్వచేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు దువ్వాడ మీదుగా గాజువాక, లంకెలపాలెం, అగనంపూడి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలు, లారీ అయితే రూ.8-9 వేలకు అమ్ముతున్నారు. ఇళ్ల నిర్మాణం కోసం ఫ్లైయాష్‌తో ఇక్కడే ఇటుకలు తయారు చేస్తున్నారు. అక్రమార్కులు వీటిని కూడా చోరీ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల దుర్మరణం

... 5వ పేజీ తరువాయి

తలుపులమ్మ లోవకు వెళ్లాడు. సాయంత్రం అక్కడి నుంచి ఎలమంచిలికి బయలుదేరారు. ఎస్.రాయవరం మండలం గోకులపాడు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న కారును అధిగమించే క్రమంలో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ వీరిని ఢీకొన్నది. రంజిత్‌కుమార్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రంజిత్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఇదిలావుండగా ఎస్.రాయవరం గ్రామానికి చెందిన గింజాల హరీశ్ (20) అడ్డరోడ్డులోని ఒక ద్విచక్ర వాహన షోరూంలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి బైక్‌పై లింగరాజుపాలెం వెళుతున్నాడు. ఈ గ్రామానికి కొద్ది దూరంలో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. హరీశ్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్ పంపారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ రెండు సంఘటలపై అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక పాఠాలు

... 5వ పేజీ తరువాయి

స్టూడెంట్స్ పేరుతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. శిక్షణలో భాగంగా తొలిదశలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల నుంచి ఇద్దరు చొప్పున అధ్యాపకులను ఎంపిక చేసి ఐఐఎంలో శిక్షణ ఇస్తారు. దీనిని ట్రైన్ ద ట్రైనర్ మాడ్యూల్‌లో నిర్వహించనున్నారు. వీరిద్వారా కాలేజీల్లోని విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ రెండు దశల్లో ఉంటుంది. మొదటిదశలో ఆర్థికఅంశాలపై శిక్షణ ఇచ్చి, అనంతరం పరీక్ష నిర్వహిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను ఐఐఎం పర్యవేక్షిస్తుంది. ఇందులో భాగంగా మార్కెట్ ఫంక్షనింగ్, రిస్క్, రిటర్న్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా స్టాక్‌మార్కెట్, బాండ్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఫారెన్ ఎక్స్ఛేంజ్, క్రిప్టో కరెన్సీపై అవగాహన కల్పిస్తారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టడం, లాభాలను ఆర్జించడంలో మెలకువలు తెలుస్తాయని ఏఎంఎఫ్ఐ భావిస్తోంది. తద్వారా భవిష్యత్తులో మనదేశం బలమైన ఆర్థికవ్యవస్థగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వచ్చే నెల 13 నుంచి అధ్యాపకులకు శిక్షణ ప్రారంభిస్తామని ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు. దీనివల్ల సురక్షితమైన పెట్టుబడులు పెట్టే మార్గాలు తెలుస్తాయని ఫైనాన్షియల్ లిటరీ ప్రొగ్రామ్ ఫర్ డిగ్రీ కాలేజీ స్టూడెంట్ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విజయభాస్కర్ మారిశెట్టి తెలిపారు. ఏటా20వేల మంది విద్యార్థులకు శిక్షణ అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు.

'ఆశా'లను పర్మనెంట్ చేయాలి

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సుబ్బారావు, ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు పోచమ్మ, పి.ధనశ్రీ, డి.సుధారాణి, సీఐటీయూ జిల్లా ప్రతినిధులు వీవీ శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పాలన

... 5వ పేజీ తరువాయి

అప్పగించారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇన్‌చార్జి జేఈగా నర్సీపట్నం జేఈ ఏడాదిన్నర నుంచి వ్యవహరిస్తున్నారు. దీంతో జల్ జీవన్ మిషన్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పంచాయతీరాజ్ జేఈ పోస్టు సైతం ఇన్‌చార్జితో కొనసాగుతున్నది. ఇక్కడ పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మెటీరియల్ కాంపోనెంట్ పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలేదు. దీంతో ఆయా పనులు చేపట్టిన వారు ఇబ్బందులు పడుతున్నారు. మండల విద్యా శాఖ అధికారులుగా ఐదేళ్ల నుంచి ఇన్‌చార్జిలే వుంటున్నారు. రెండున్నరేళ్ల క్రితం వరకు కె.సత్యనారాయణ, 2023 జూలై నుంచి ఇప్పటి వరకు నాతవరం మండలం తాండవ హైస్కూల్ హెచ్ఎం ఓ.సత్యనారాయణ గొలుగొండ ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల బాధ్యతల కారణంగా ఆయన గొలుగొండకు అరుదుగా వస్తుంటారు. దీంతో ఉపాధ్యాయులు తమ సమస్యలతోపాటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకుని ఆయా ప్రభుత్వ శాఖలకు పూర్తిస్థాయి అధికారులను నియమించేలా చూడాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వానరమూకతో బెంబేలు

... 5వ పేజీ తరువాయి

అటవీ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇటీవల పట్టణంలో పర్యటించిన సందర్భంగా కోతులు అధికంగా వుండడాన్ని గమనించారు. వీటి సమస్య లేకుండా చూడాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కానీ ఇంతవరకు వారిలో కదలిక లేదు.

ఘనంగా లక్ష బిల్వార్చన



చినదొడ్డిగల్లులో సామూహిక హారతులిస్తున్న అయ్యప్పస్వామి దీక్షలు

నక్కపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ అయ్యప్ప దీక్షా సంఘం ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన కూడలిలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ భక్తులు, గ్రామస్థులను తన్మయత్వానికి గురి చేసింది. వందలాది మంది అయ్యప్ప,శివ దీక్షాపరులు హాజరయ్యారు. వేదపండితులు శాస్త్రోక్తంగా అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. అనంతరం దీక్షాపరులు అయ్యప్పస్వామికి సామూహిక హారతులిచ్చారు. కార్యక్రమంలో చంటి గురుస్వామి, చినదొడ్డిల్లు గురుస్వాములు , పెద్దలు పాల్గొన్నారు.

'కేసులకు భయపడొద్దు'

నక్కపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మన ఊరికోసం, పిల్లల భవిష్యత్తు కోసం కలిసికట్టుగా పోరాటం సాగించాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ నక్కపల్లి మండలశాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం రాజయ్యపేటలో 57వ రోజుకు చేరుకున్న మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీబావం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై అరెస్టై,బెయిల్‌పై విడుదలైన పిక్కితాతీలు, రాంచరణ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు, గ్రామాల ఉనికిని కాపాడుకోసం జరుగుతున్న ఉద్యమాన్ని రాజకీయాలకతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడి విజయం సాధించాలని కోరారు. పోలీస్ కేసులకు భయపడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, సూరకాసుల గోవింద్, ఎరుపిల్లి నగేశ్ , తదితరులున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



సమావేశమైన గ్రంథాలయ కమిటీ సభ్యులు

పాయకరావుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో సమావేశమైన కమిటీ సభ్యులు వారోత్సవాలు నిర్వహణపై చర్చించారు. అనంతరం ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు వివరాలను తెలిపారు. వారోత్సవాలు ప్రారంభంలో భాగంగా ఈనెల 14న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామన్నారు. 15న క్విజ్ పోటీలు, వక్తృత్వ పోటీలు, 16న పుస్తక ప్రదర్శన, 17న చిత్రలేఖనం, యోగాసనాలు, 18న భగవద్గీత, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 19వ తేదీన మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎన్.టీ.సీతారామమూర్తి, వై.అచ్యుతరావు, తాళ్లరావు, ఎస్.సీతారామమూర్తి, డి.పాపారావు, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గోతులు.. రాకపోకలకు పాట్లు

- గోపాలపట్నం- పెంటకోట మార్గంలో దుస్థితి



గోపాలపట్నం వద్ద గోతులతో ఉన్న రహదారి

పాయకరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం-పెంటకోట రోడ్డు అధ్వానంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపట్నం శివారు పెద్దిపాలెం నుంచి పెంటకోట గ్రామం వరకుగల సుమారు 5 కిలోమీటర్ల పొడవునా గోతులతో నిండి ఉంది. గత కొన్నేళ్లుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు ధ్వంసమై గోతుల మయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. గోతుల్లో పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు. ఈ రోడ్డు మీదుగా పెంటకోట, గోపాలపట్నం, బంగారయ్యపేట గ్రామాల ప్రజలు నిత్యం పయణం సాగిస్తుంటారు. పెంటకోట సముద్ర తీరానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సముద్ర స్నానాలకు వస్తుంటారు. పెంటకోటలోని హేచరీలకు సంబంధించిన వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని, కూటమి ప్రభుత్వంలో నైనా రోడ్డు వేయాలని పెంటకోట, గోపాలపట్నం, తదితర గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



ఎస్ రాయవరంలోని వైభవ వేంకటేశ్వరస్వామి

ఎస్. రాయవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైభవ వేంకటేశ్వర స్వామి వారి దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను 12వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. తొలిరోజు ఉదయం నుంచి వేద పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం, మృత్సంగ్రహణంతో తీర్థప్రసాద గోష్ఠి తదితర పూజలు నిర్వహించారు. ఉత్సవాల ఆలయాన్ని కమిటీ ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు అధికసంఖ్యలో తరలిరానున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు గోవిందరావు చెప్పారు.

చోరీకి గురైన వాహనం స్వాధీనం

పాయకరావుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చోరీ అయిన బొలెరో వాహనాన్ని పోలీసులు పట్టుకుని యజమానికి అప్పగించారు. ఆదివారం పోలీసులందించిన వివరాలివి.. స్థానిక మెయిన్‌రోడ్డులోని సాయి వేదిక కల్యాణ మండపం స మీపంలో పార్కింగ్‌చేసిన బొలెరో వాహనం శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో వాహనం యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల ద్వారా వాహనం కదలికలను గుర్తించారు. శనివారం తెల్లవారుజామున వాహనాన్ని పట్టుకు పోయిన వ్యక్తి తొలుత వాహనాన్ని నక్కపల్లి వైపు తీసుకు వెళ్లాడన్నారు. అయితే, వేంపాడు టోల్ గేటు వద్ద సీసీ కెమెరాల్లో నమోదవుతుందన్న విషయం గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉద్దండపురం వద్ద వాహ నాన్ని వెనక్కి మళ్ళించి కాకినాడ జిల్లా అన్నవరం వైపు వెళుతుండగా.. పాయకరావుపేట వద్ద తాండవ వంతెన దాటి తునిలోని ఫ్లై ఓవర్ దిగిన తరువాత వాహనంలో ఆయిల్ అయిపోయి ఆగిపోవడంతో వాహనాన్ని అక్కడే వదిలి వెళ్ళిపోయాడు. వెంటనే ఆదివారం ఉదయం వాహనాన్ని గుర్తించి యజమానికి అప్పగించామని పోలీసులు తెలిపారు.

రేవుపోలవరం సముద్ర తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో కిటకిటలాడుతున్న సముద్రతీరం

ఎస్. రాయవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంతో పాటు ఆదివారం కావడంతో మండల పరిధిలోని రేవుపోలవరం సముద్రతీరానికి పర్యాటకుల తాకిడి నెలకొంది. ఈ ప్రాంతం వనభోజనాలకు అనుకూలమే కాకుండా ఇక్కడి సముద్రతీరం ఆహ్లాదకరంగా ఉంటుంది. దీంతో అధికసంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్దఎత్తున రావడంతో సముద్రతీరం ఒక్కసారిగా కిటకిటలాడింది. సముద్రంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. మధ్యాహ్నం తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు. పలు ఆటలు ఆడారు. ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకుండా మెరైన్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు గస్తీ నిర్వహించారు. డ్రోన్‌తో నిఘా పర్యవేక్షించారు.

నూకాంబిక ఆలయంలో భక్తుల కోలాహలం


బాలాలయంలోని అమ్మవారు

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనం కల్పించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహల వాతావరణం నెలకొంది. కుటుంబాలతో విచ్చేసిన పలువురు ఆలయం ఆవరణలోని కాటేజీల్లో, తోటల్లో వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

ఆంజనేయ ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు తదితరులు

పరవాడ/లంకెలపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలిలో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈనెల 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా మహత్ పంచకశాంతి కల్యాణం, మహా కుంభాభిషేకం వంటివి చేపడతామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి మడక రమేష్‌నాయుడు, పి.వాసుదేవరావు, ఎ.రవికుమార్, కేవీ సాంబశివరావు, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత


నాగేశ్వరరావుకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రం అందజేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. మొగలిపురంలో ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ముఖ్య మంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. పేదలకు కూటమి ప్రభుత్వం అన్నిరంగాల్లో తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చైతన్య, గండి దేముడు, పోతల కనకరాజు, నాగేంద్ర, గెడ్డప్ప, గొర్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాను జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసి దృశ్యం

సబ్బవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాటజంగాలపాలేనికి చెందిన ఆర్మీ జవాను గొర్లి శంకర్ జయంతి సందర్భంగా ఆయన మిత్ర బృందం ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి యువత స్వచ్ఛందంగా విచ్చేసి రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడాల వెంకటరమణ, ఉప సర్పంచ్ కాపుశెట్టి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం బ్రిడ్జిపై పొంచి ఉన్న ప్రమాదం



బ్రిడ్జిపై శ్లాబ్‌నకు రంధ్రం పడినచోట ఏర్పాటు చేసిన స్టాపర్

లంకెలపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ, పరవాడ వెళ్లే మార్గంలోని రైల్వే క్రాసింగ్‌పై ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ బ్రిడ్జిపై ప్రమాదం పొంచి ఉంది. శ్లాబ్‌నకు పెద్ద రంధ్రం ఏర్పడింది. ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రంధ్రం మరింత పెద్దగా మారింది. లంకెలపాలెం, పరిసర ప్రాంత ప్రజలతో పాటు, ఫార్మాసిటీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు నిత్యం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. రంధ్రం పెద్దదిగా మారడంలో ప్రమాదాల నివారణకు పోలీసులు తూతూ మంత్రంగా స్టాపర్ ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలతో స్టాపర్ పక్కకు జరిగిపోతుంది. దీంతో ద్విచక్ర వాహనాల టైర్లు రంధ్రంలో ఇరుక్కు పోయి ప్రమాదాలకు గురవుతున్నారు. వాహన చోదకుల అదమరిచి ప్రయాణిసే ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జిపై గల రంధ్రానికి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

సంబరాలకు సన్నాహాలు

గౌరమ్మ జాతరలకు పెట్టింది పేరు అనకాపల్లి

- ఇప్పటికే బాల గైరమ్మ అనుపోత్సవాలు ఆరంభం
- వచ్చే నెల నుంచి అసలు వేడుకలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన నిర్వాహకులు

గౌరీ పరమేశ్వరుల జాతర.. ఈ వేడుక అంటే.. ఉత్తరాంధ్ర ప్రజలకు గుర్తుకు వచ్చేది అనకాపల్లి. ఇక్కడ ఈ ఉత్సవాలను పోటాపోటీ తరహాలో నిర్వహిస్తుంటారు. స్థానికంగా పుట్టి వివిధ రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన వారు సైతం కుటుంబాలతో విచ్చేసి ఆది దంపతుల సేవలో తరిస్తారంటే.. ఇక్కడ ఏ స్థాయిలో జరుగుతుంటాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అంబరాన్నంటే ఈ సంబరాలకు ఇక్క ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.


గౌరీ పరమేశ్వరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముఖ్యంగా మెయిన్ రోడ్డులోని చిన నాలుగురోడ్ల జంక్షన్ వద్ద గల కుంచావారి గౌరీ పరమేశ్వరులు, మెయిన్ రోడ్డులోని వేల్పులవీధి జంక్షన్‌లో గల వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులు, గవరపాలెం సతకంపట్టులోని గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇప్పటికే ఆయా ఆలయాల్లో గత నెలలోనే గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఇప్పుడు ఉత్సవాల నిర్వహణకు కమిటీ సభ్యులు నిమగ్నమై ఉన్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఉత్సవాలను ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. పైన పేర్కొన్న మూడు ప్రాంతాల్లోనే కాకుండా గవరపాలెంలోని కోటవీధి, అగ్గిమర్రిచెట్టు వీధి, విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, ఆశీలమెట్ట జంక్షన్‌లలో కూడా జనవరి నెలాఖరు లోపు ఉత్సవాలను పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక్క అనకాపల్లిలోనే కాకుండా కశింకోట, మునగపాక, చూచుకొండ, గణపర్తి, ఎలమంచిలి, చోడవరం తదితర ప్రాంతాల్లో కూడా కార్తీకమాసం నుంచి ధనుర్మాసం వరకు ఈ గౌరీ పరమేశ్వరుల జాతరలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.


సతకంపట్టులోని గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఆలయం

భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణకు ఏర్పాట్లు

ఈ ఏడాది డిసెంబరు 20న కుంచావారి ఉత్సవం, జనవరి నెలలో సంక్రాంతి పండుగ మరుసటి శనివారం వేల్పులవీధి ఉత్సవం, ఆఖరి శనివారం గవరపాలెం ఉత్సవాలను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు సన్నాహాలు ప్రారంభించాయి. ఈ ఏడాది కూడా భారీ ఎత్తున విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు. దారి పొడవున విద్యుద్దీపాలంకరణ చేపట్టడంతో పాటు ఆయా ఆలయాలను సర్వాంగ సుందరగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే, పలుచోట్ల స్టేజిలు వేసి సాంస్కృతి కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. చివరిగా ఇక్కడ బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

సారె మహోత్సవం ప్రత్యేకం

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు రెండు రోజుల ముందు నిర్వాహకులు గౌరమ్మకు సారెను సమర్పిస్తుండడం ఇక్కడ ఆనవాయితీ. కుంచావారి, వేల్పులవీధి, గవరపాలెంతో పాటు విజయరామరాజుపేటలో కూడా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల భక్తులు ఇళ్ల వద్ద వివిధ రకాల పిండి వంటలు తయారు మేళతాళాల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తుంటారు.

గవరపాలెం ఆలయ విశేషాలు

గవరపాలెం గౌరీ పరమేశ్వరులను 1886లో మట్టి దిబ్బలపై తాటి కమ్మలు వేసి మట్టి గౌరీ పరమేశ్వరుల ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు చేసేవారు. అనంతరం 1964లో కొణతాల జగ్గారావు గుడి నిర్మించి లక్క విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. 1979లో కొణతాల మనోహరనాయుడు బాధ్యతలు తీసుకున్నాక 1998లో నూతన ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏటా ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

వేల్పుల వీధిలో...


వేల్పుల వీధి జంక్షన్‌లోని వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఆలయం

165 ఏళ్ల క్రితం దివంగత వేల్పుల రామారావు పూర్వీకుల ఇంట బాల గౌరమ్మగా వెలిసింది. అప్పటి నుంచి వేల్పుల వీధి పెద్దల పర్యవేక్షణలో ఆలయంలో అమ్మవారికి పూజలు చేయడంతో పాటు ఏటా సంక్రాంతి పండుగ మరుసటి శనివారం రోజున ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. పాత గుడిని తొలగించి కొన్నేళ్ల క్రితం నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది కూడా పటిష్ఠమైన ఏర్పాట్లు చేసి ఉత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు ప్రారంభించారు.

కుంచావారి వీధిలో...


చిన నాలుగురోడ్ల జంక్షన్ వద్ద గల కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఆలయం

కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని 1811 నుంచి ఏటా డిసెంబరు నెలలో నిర్వహిస్తుంటారు. డిసెంబరు 20వ తేదీన ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. 2010 సంవత్సరం సమయంలో పాత గుడి స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించి నిత్యం పూజలు చేస్తున్నారు.

భోగలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం


స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పర్వదినం సందర్భంగా భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు దాతలు మళ్ల జగ్గఅప్పారావు దంపతులు వాయినాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద గల గౌరీపరమేశ్వరుల ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం లక్ష బిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా 216 పార్థివ లింగాలకు విశేష పూజలు జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులు కొణతాల అప్పలనాయుడు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భువనేశ్వరీదేవి ఆలయంలో ఆదివాస మహోత్సవం


భువనేశ్వరీదేవికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సబ్బవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరిపాక శివారు పెదయాతపాలెం సమీపం మణిపురం వద్ద కొలువుదీరిన భువనేశ్వరీదేవి ఆలయంలో ఆదివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్య భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. సబ్బవరం సీఐ జి.రామంద్రరావు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ బుచ్చిరాజు గంటాను శాలువాతో సత్కరించారు.

'ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాలలు నిర్వహించాలి'


ర్యాలీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్, భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీని అంతా విజయవంతం చేయాలని వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటుందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, దంతులూరి దిలీప్‌కుమార్, కేఎం నాయుడు, కొణతాల మురళీ, జాజుల రమేష్, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాలలను నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ డిమాండ్ చేశారు. మొగలిపురంలో గండి రవికుమార్, ఆరిపాకలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రచ్చబండ కార్యక్రమాల్లో మాట్లాడారు. నాయకులు బోకం రామునాయుడు, కొటాన రాము, కర్రి బాబు, యడ్ల నాయుడు, బోను నాయుడు, సిరపరపు వాసు, ఐడి బాబు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు లింక్ ద్వారా నగదు మాయం

- అనకాపల్లిలో సైబర్ నేరం
- కేసు నమోదు చేసిన పోలీసులు

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరంపై ఆదివారం పట్టణ పోలీసుకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి సీఐ జి.ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలివి. కొత్తూరు జంక్షన్‌లో నివాసం ఉంటున్న నరంశెట్టి పాండురంగా అనకాపల్లిలోని ఓ హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. ఈయన వాట్సాప్‌నకు మార్చి 24వ తేదీన ఓ లింక్ వచ్చింది. ఈ లింక్‌లో గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడి ఈ లింక్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించాడు. దీంతో పాండురంగా ఈ ఏడాది మే ఆరో తేదీ నుంచి 25వ తేదీ మధ్య రూ.ఆరు లక్షల మూడువేలను ఇన్వెస్ట్‌మెంట్ చేశాడు. ఆ తరువాత నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో మోసపోయాయని గుర్తించి సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తల సమావేశాన్ని మండలంలోని గొర్లివానిపాలెం పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించనున్నట్టు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ తెలిపారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో గల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే తహశీల్దార్, ఎంపీడీవో, పోలీసుశాఖ అధికారులతో కలిసి ఆయన గ్రీవెన్స్‌లో పాల్గొంటారని వివరించారు. ప్రజలంతా తమ సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా కోరారు.

60 మందికి వైద్య పరీక్షలు


రోగులతో మాట్లాడుతున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో ఆదివారం ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రిటైర్డు డిప్యూటీ సివిల్ సర్జన్ సాంబమూర్తి, డాక్టర్ మీనేంద్రకుమార్‌ల బృందం అరవై మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వేదిక కార్యదర్శి టి.కామేశ్వరరావు, ముఖ్య నాయకులు మళ్ల చంద్రశేఖర్, కొణతాల త్రినాథ్, కె.శ్రీరామ్మూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవుని ఆలయాన్ని సందర్శించిన గణపతి సచ్చిదానంద


ఆలయంలో భక్తులతో సంభాషిస్తున్న స్వామీజీ

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మురళీ నగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మైసూరు దత్తపీఠం అవధూత గణపతి సచ్చిదానంద స్వామీజీ సందర్శించారు. ఆదివారం సాయంత్రం విచ్చేసిన స్వామీజీకి ఆలయవర్గాలు శుభ స్వాగతం పలికాయి. ఆలయంలో అర్చకులు శేష స్వామి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనమిచ్చారు. అనంతరం ఆలయ సన్నిధిలో గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్తులతో సంభాషించారు. భక్తితత్త్వంపై జీవన సూత్రాలు తెలియజేశారు.

సమాజ హితమే అందరి లక్ష్యం కావాలి

- ఎంపీ రమేష్ కార్యాలయ ఇన్‌చార్జి విజయ్‌నాయుడు



మాట్లాడుతున్న విజయ్‌నాయుడు

కొత్తూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని బీజేపీ నాయకుడు, ఎంపీ సీఎం రమేష్ కార్యాలయ బాధ్యుడు విజయ్ నాయుడు అన్నారు. అనకాపల్లి మండలం సంపతిపురంలో ఆదివారం వెలమ ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజ హితానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం వెలమ సంఘానికి ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన మిరియాల రాజేంద్రప్రసాద్ దంపతులను సత్కరించారు. వెలమ ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కూండ్రపు భీమ, లాలం కన్నాజీ, డీఆర్‌వో ఉదయశ్రీ, ప్రతినిధులు రాజాన అప్పారావు, బైరాగి నాయుడు, డాక్టర్ పూడి సందీప్, పెదపాటి కళ్యాణి, ప్రకాష్, రాంబాబు, శ్రీరామ్మూర్తి, అప్పలరాజు, అర్జున, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


1988లో ఆశ్రమ బాలుర పాఠశాల నిర్మించిన వసతిగృహం


పాఠశాలలో విరికిగిన కిటికీలు


వర్షాలకు కూలిన ప్రహరీ గోడ

శిథిల భవనాల్లో చిన్నారులకు ఎంత కష్టం

- సమస్యల్లో.. కొత్తవలస బాలుర ఆశ్రమ పాఠశాల
- కారుతున్న రూపాంతర భవనం
- కిటికీలకు తలుపులులేక చలికి విద్యార్థులకు వణుకు

అనంతగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూత వేటు దూరంలోనున్న కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో సమస్యలు వెంటాడుతున్నాయి. సుమారు 450 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. 1988లో ఇక్కడ వసతిగృహ భవనాన్ని నిర్మించారు.. అయితే, గతంలో పలుమార్లు ఈ రూపాంతరం భవనంపై కప్పు రేకులు భారీ గాలులకు ఎగిరిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. తరువాత మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతం విద్యార్థులు అందులోనే నిద్రిస్తున్నారు. వసతిగృహ భవనం నిర్మించి, 37 సంవత్సరాలు కావస్తుండడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఏ సమయంలో కూలుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో రుపాంతరం భవనం పైకప్పు రేకుల నుంచి నీరు లోనికి చేరుతుండడంతో విద్యార్థులు నిద్రించేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ భవనం కింద గదుల్లో పడుకుంటున్న విద్యార్థులపై శ్లాబ్ నుంచి పెచ్చులూడిపడుతున్నాయి. చాలా ఏళ్ల క్రితం భవన కావడంతో మరమ్మతులకు వీలులేకుండాపోయింది. అలాగే, గచ్చులన్నీ పగిలిపోయాయి. కిటికీలు, తలుపులు పూర్తిగా లేవు.. అయినా, విద్యార్థులు అందులోని బసచేయాల్సిన దుస్థితి నెలకొంది. గెడ్డను ఆనుకుని వసతిగృహం ఉండడం.. పడుకునే సమయంలోని కిటికీలు, తలుపులు సక్రమంగా లేక చలిగాలులకు నిద్రపట్టడం లేదని, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిమితంగానే మరుగుదొడ్లు

అధిక సంఖ్యలో విద్యార్థులు ఉండడం పాఠశాలలోని 45 మరుగుదొడ్లు మాత్రమే పరిమితం కావడంతో కొందరు ఆరుబయట ఆశ్రయించాల్సి వస్తోంది. వసతి గృహంలో కనీసం ఫ్యాన్లు కూడా లేవు. అలాగే, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపైనుంచి వరదనీరు పోటెత్తి పాఠశాల ప్రహరీ రెండుచోట్ల పడిపోవడంతో వరదనీరు తరగతి గదులవైపుగా రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలోని తదితర సదుపాయలు లేకపోవ డంపై జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ దృష్టికి ఈ పాఠశాల వసతిగృహ సమస్యపై తీసుకువెళ్తామని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు హామీ ఇచ్చారు.

రద్దీగా మోదకొండమ్మ ఆలయం


అలంకరణలో మోదకొండమ్మ

పాడేరురూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. అమ్మవారి దర్శనానికి మన్యంలోని భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది, అయ్యప్ప, శివ, భవానీ మాలధారులు, ప్రకృతి అందిలను తిలకించేందుకు పాడేరు ప్రాంతానికి వచ్చిన భక్తులతో ఉదయం 6 గంటల నుంచి రావడంతో రద్దీ నెలకొంది. భక్తులతో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలను చేపట్టారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదం, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద ఉన్న అమ్మవారి పాదాలను మైదాన ప్రాంతం నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.


మోదకొండమ్మసన్నిధిలో భక్తులు

అభివృద్ధికి కృషి చేస్తా: ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంతోపాటు, మండలం అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎంపీపీ కూడా రాజుబాబు తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. తనపైన అవిశ్వాసం పెట్టాలని కొందరు నాయకులు ప్రయత్నాలు చేశారన్నారు. అయితే, టీడీపీ, బీజేపీ, సీపీఎం, వైసీపీలకు చెందిన సభ్యులు తన వ్యక్తిత్వం చూసి సహకరించలేదన్నారు. ఈనెల 5వతేదీన అవిశ్వాస తీర్మానంపై సమావేశానికి స భ్యులు ఎవరూ హాజరు కాలేదన్నారు. తనపై విశ్వాసం ప్రకటించిన సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.ఈ నెల 10 తేదీనమండల సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలు, అభి వృద్ధి పనులపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తేవాలన్నారు. అందరూ కలిసికట్టుగా మండలం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పాఠశాలల పరిశీలన


దాయర్తి గ్రామంలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో బాలాజీ

అనంతగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల పినకోట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని బుడ్డిగరువు, మద్రేబ్, దాయర్తి, చింతలపాలెం గ్రామాల్లోని పాఠశాల పరిస్థితిని ఎంఈవో కిల్లో బాలాజీ ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల గిరిజనులతో మమేకయ్యారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపాటుగా ఉపాధ్యాయులు ప్రతిరోజు విధులు వస్తున్నారా లేదా అని అడిగితెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల్లో సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. చిన్నారుల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రవి సమ్యూయేల్, గిరిజనులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష


భిక్షలో పాల్గొన్న అయ్యప్ప, భవానీ మాలధాలు

పాడేరురూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం అన్న సమారాధన(భిక్ష) కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి వెయ్యాకుల సత్యనారాయణ పీఠం స్వాములు ఆర్థిక సహాయంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి పట్టణంలో మాలధారులతో పాటు వివిధ గ్రామాల నుంచి మోదకొండమ్మ దర్శనానికి వచ్చిన అయ్యప్పస్వాములు సుమారు 500 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రమణ, పీఠం స్వాములు ఎస్.కొండలరావు, బి.శ్రీనివాసరావు, పి.మధు, వై.శ్రీనివాసరావు, జి.రాజు, కె.రామునాయుడు, పి.స్వాతికుమార్, బి.తిరుమలరావు, ప్రసాద్,రామారావు, కౌశిక్, లోకేశ్ పాల్గొన్నారు.

గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చింతపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక టీ జంక్షన్‌లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో గంజాయి సాగు కట్టడి చేశామన్నారు. ప్రస్తుతం ఒడిశా నుంచి గంజాయి గిరిజన ప్రాంతం మీదుగా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి కేసులు నమోదైతే నిందితుల ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆర్ఎస్ఐబాలాజీ పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు సహకరించాలి


దొన్ను దొరకు వినతి పత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

హుకుంపేట నవంబరు 9 ఆంధ్రజ్యోతి ; ఇటీవల తుఫాన్‌కు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలానికి చెందిన టీడీపీ శ్రేణులు ఆదివారం ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, పార్టీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మండలంలోని 33 పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల రోడ్లు, కల్వర్టులు తుఫాన్‌కు మరమ్మతులకు లోనయ్యాయన్నారు. కామయ్యపేట రంగశీల నుంచి రూడి, ఉప్ప, బాకూరు, కొండచిడిపుట్టు, పాట్టిగరువు, గత్తున్ గ్రామాల రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. దొన్నుదొర స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంజుబాబు, నాగేశ్వరరావు, పాడి బాలన్న ,అచ్చమ్మ మత్స్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నేత సూర్యనారాయణ పడాల్

పాడేరురూరల్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేలను అందిస్తున్న 104 వాహనాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐ టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్య నారాయణ పడాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన 104 ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అరబిందో నుంచి బకాయిలు, గ్రాట్యూటీ, ఎర్న్‌లీవ్‌ల చెల్లింపుల్లో సిబ్బందికి అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ బకాయిలను అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కూడా ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వత్తిడి పెంచి పనులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు సిబ్బందికి నియామక పత్రాలు, పే స్లిప్స్ ఇవ్వకపోవడం విచారకరమన్నారు. 104లో ఫార్మసిస్ట్‌ని నియమించాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన వారికి జీవో 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, డీఈవోలకు రూ. 18,500 వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐలలో వాటాను యాజమాన్యం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి రామ్మూర్తి, జిల్లా నాయకులు అప్పలరాజు, ఎస్‌కే.నజీర్, నాయుడు, సూరి పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

జి.మాడుగుల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉవ్వాసింగి పంచాయతీ ప్రాంతంలో చిత్తులాట (బొమ్మా -బొరుసు) శిబిరంపై దాడులు నిర్వహించి 15 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు స్థానిక సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గత కొద్ది రోజుల ఆ ప్రాంతంలో చిత్తులాటలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం సోదాలు నిర్వహించమన్నారు. సంఘటనా స్థలంలో ద్విచక్రవాహనాలు వదిలి పరారైనట్టు తెలిపారు. రూ. 3,500 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వాహనాల ఆధారంగా ఎనిమిది మందిని అదుపులో తీసుకున్నట్టు సీఐ చెప్పారు.

కాఫీ కార్మికుల వినూత్న నిరసన


కుటుంబ సభ్యులతో ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న కాఫీ కార్మికులు

పాడేరురూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు సంపాదించిన కార్మికుల సమస్యల పరిష్కరించడంలో అలసత్వం తగదని సంఘం గౌరవాధ్యక్షుడు లింగేరి సుందరరావు అన్నారు. కార్మికుల సమస్యలపై చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. కార్మికులు మినుములూరు కాఫీ ఎస్టేట్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఖాళీ కంచాలతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఏపీఎఫ్‌డీసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి 10వ తేదీ సోమవారం జరగనున్న కార్మిక సంఘాల చర్యల్లో హామీలను నెరవేర్చాలని కోరారు. ఏపీఎఫ్‌డీసీలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న భర్తీ చేసి సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ హెల్పర్స్ కాంతమ్మ, సత్యనారాయణ, రాంబాబు, దేవి, వరలక్ష్మి, మంగమ్మ, లక్ష్మి, చిన్నాలమ్మ, కార్మికులు కుటుంబ సభ్యులతో శిబిరంలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు


గాయపడిన గిరిజన మహిళలు

చింతపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి, చింతపల్లి ప్రధాన రహదారి పెంటపాడు వద్ద ప్రమాదవశత్తు ఆటో బోల్తాపడడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల కథనం ప్రకారం.. చిన్నగెడ్డ గ్రామానికి చెందిన ఆటోలో డ్రైవర్ రాంబాబు, కొర్ర ధనలక్ష్మి, సింహాచలం, పాంగి సతీశ్, సీతలు గూడెంకొత్తవీధి మండలం తాంగులగొంది గ్రామంలో ఇటీవల ఓ వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా పెంటపాడు వద్ద రాగానే ఆకస్మికంగా చిన్న పాప ఆటోకు అడ్డంగా వచ్చింది. దీంతో పాపను తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈఘటనలో డ్రైవర్‌తోపాటూ మరో నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. బాధితులను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, వైద్యాధికారి అనుష చికిత్స అందించారు. క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారి తెలిపారు.

ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులతో కలెక్టర్ భేటీ

- గ్రామీణ పరిపాలనపై క్షేత్ర స్థాయి అధ్యయనం


ట్రైనీ అధికారులతో మట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదివారం 12 మంది ట్రైనీ సివిల్ సర్వీసెస్ (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్) అధికారులతో భేటీ అయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది ట్రైనీ అధికారులు జిల్లాలో వై.రామవరం మండలంలో ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు గ్రామీణా పరిపాలనపై అధ్యయనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో వారంతా ఆదివారం జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. అనంతరం గ్రామీణా పరిపాలనకు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ వారికి వివరించారు. ట్రైనీ అధికారులు హరిత్విక్ రంజాన్, పర్గ్య సైని, అభినవ్ శర్మ, అకాశ్ చావడా, సదాక్ సింగ్, దివ్యనిషి పండేయ్, విందోక్ తివారీ, సిమ్రాన్ సాహు, అఖిలేశ్ సింగ్, గౌరవ్ పటేట్, శతక్షి సిన్హా, సౌరబ్ శేఖర్ కలెక్టర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో ఎంవీఎస్.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె


చాపగెడ్డ ఎస్టేట్ వద్ద ఆందోళన చేస్తున్న కాఫీ కార్మికులు

గూడెంకొత్తవీధి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని కాఫీ కార్మికులు తెలిపారు. ఆదివారం నాలుగోవ రోజు విధులను బహిష్కరించి కార్మికులు చాపగెడ్డ ఏపీఎఫ్ డీసీ ఎస్టేట్ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేశారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కూలి రేటు, పండ్ల సేకరణ ధర పెంచాలన్నారు. వర్కు అసిస్టెంట్లు రామ్‌నాథ్, బుజ్జిబాబు, గణేశ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే శిక్షణ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయ భారతి, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పాండురాజు

చింతపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇస్తున్నట్టు కోఫోకాన్ జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండు రాజు తెలిపారు. ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఇన్‌స్ట్రక్టర్ మాట్లాడుతూ పీఎం ఉషా పథకం అండర్ గేమ్స్ స్కిల్స్‌లో భాగంగా సెల్ఫ్ డిఫెన్స్ కరాటే శిక్షణ ఇస్తున్నామన్నారు. 30 రోజులపాటు శిక్షణ పూర్తయిన తర్వాత గ్రేడింగ్ పరీక్ష నిర్వహించి వివిధ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అధ్యాపకులు, కరాటే ఇన్‌స్ట్రక్టర్ గణేశ్ పాల్గొన్నారు.

గజగజ

- పెరిగిన చలి తీవ్రత

ముంచంగిపుట్టు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో చలి తీవ్రత పెరిగింది. ఉదయం తొమ్మిది గంటలు వరకు మంచు తెరలు వీడటంలేదు. సాయంత్రం నాలుగు గంటలు నుంచే చలి గా లులు మొదలవుతున్నాయి. దీంతో ప్రజలు గజగజలాడిపోతున్నారు. ఆదివారం ఉదయం చలి విపరీతంగా ఉంది. ఉదయం తొమ్మిది దాటినా మంచు దట్టంగా కమ్ముకుంది. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పిల్లలు, వృద్ధులు చలికి ఆపసోపాలు పడుతున్నారు. సాయంత్రం నాలుగు గంటలకే చలి మొదలు పెట్టింది.


ముంచంగిపుట్టులో దట్టంగా మంచు

పడకేసిన పాలన

... 5వ పేజీ తరువాయి

అప్పగించారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇన్‌చార్జి జేఈగా నర్సీపట్నం జేఈ ఏడాదిన్నర నుంచి వ్యవహరిస్తున్నారు. దీంతో జల్ జీవన్ మిషన్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పంచాయతీరాజ్ జేఈ పోస్టు సైతం ఇన్‌చార్జితో కొనసాగుతున్నది. ఇక్కడ పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మెటీరియల్ కాంపోనెంట్ పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలేదు. దీంతో ఆయా పనులు చేపట్టిన వారు ఇబ్బందులు పడుతున్నారు.

మండల విద్యా శాఖ అధికారులుగా ఐదేళ్ల నుంచి ఇన్‌చార్జిలే వుంటున్నారు. రెండున్నరేళ్ల క్రితం వరకు కె.సత్యనారాయణ, 2023 జూలై నుంచి ఇప్పటి వరకు నాతవరం మండలం తాండవ హైస్కూల్ హెచ్‌ఎం ఓ.సత్యనారాయణ గొలుగొండ ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల బాధ్యతల కారణంగా ఆయన గొలుగొండకు అరుదుగా వస్తుంటారు. దీంతో ఉపాధ్యాయులు తమ సమస్యలతోపాటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకుని ఆయా ప్రభుత్వ శాఖలకు పూర్తిస్థాయి అధికారులను నియమించేలా చూడాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదల ఇళ్ల లేఅవుట్లలో దొంగలు

... 5వ పేజీ తరువాయి

రూ.35 వేల చొప్పున ప్రభుత్వం వసూలు చేయించింది. కానీ కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేయడంతోపాటు తీవ్ర జాప్యం చేశారు. గత ఏడాది ప్రభుత్వం మారేనాటికి ఎక్కడా ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు. అప్పటి ప్రభుత్వం బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణ పనులను మధ్యలో ఆపేశారు. దీంతో కొంతమంది స్థానికులు సిమెంటు, ఇసుక, ఇనుము, కంకరను తస్కరించుకుపోయారు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల నిర్మాణ పనులు మళ్లీ మొదలయ్యాయి. కాలనీలను త్వరగా నిర్మించాలన్న ఉద్దేశంతో ఇసుకు, ఇనుము, కంకర, సిమెంటును పెద్ద మొత్తంలో సరఫరా చేస్తున్నది. వీటిని కాలనీల్లో పలచోట్ల డంపింగ్ చేస్తున్నారు. రక్షణ కోసం సెక్యూరిటీ గార్డులను నియిమించలేదు. దీంతో అక్రమార్కులు మళ్లీ బరితెగించారు. చీకటి పడిన తరవాత సిమెంటు, ఇసుక, ఇనుము, కంకరను ఎత్తుకుపోతున్నారు. సమీపంలోని తోటలు, ప్రైవేటు లేఅవుట్లలోకి తరలించి నిల్వచేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు దువ్వాడ మీదుగా గాజువాక, లంకెలపాలెం, అగనంపూడి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలు, లారీ అయితే రూ.8-9 వేలకు అమ్ముతున్నారు. ఇళ్ల నిర్మాణం కోసం ఫ్లైయాష్‌తో ఇక్కడే ఇటుకలు తయారు చేస్తున్నారు. అక్రమార్కులు వీటిని కూడా చోరీ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల దుర్మరణం

... 5వ పేజీ తరువాయి

తలుపులమ్మ లోవకు వెళ్లాడు. సాయంత్రం అక్కడి నుంచి ఎలమంచిలికి బయలుదేరారు. ఎస్.రాయవరం మండలం గోకులపాడు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న కారును అధిగమించే క్రమంలో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ వీరిని ఢీకొన్నది. రంజిత్‌కుమార్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రంజిత్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఇదిలావుండగా ఎస్.రాయవరం గ్రామానికి చెందిన గింజాల హరీశ్ (20) అడ్డరోడ్డులోని ఒక ద్విచక్ర వాహన షోరూంలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి బైక్‌పై లింగరాజుపాలెం వెళుతున్నాడు. ఈ గ్రామానికి కొద్ది దూరంలో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. హరీశ్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్ పంపారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ రెండు సంఘటలపై అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక పాఠాలు

... 5వ పేజీ తరువాయి

స్టూడెంట్స్ పేరుతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. శిక్షణలో భాగంగా తొలిదశలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల నుంచి ఇద్దరు చొప్పున అధ్యాపకులను ఎంపిక చేసి ఐఐఎంలో శిక్షణ ఇస్తారు. దీనిని ట్రైన్ ద ట్రైనర్ మాడ్యుల్‌లో నిర్వహించనున్నారు. వీరిద్వారా కాలేజీల్లోని విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ రెండు దశల్లో ఉంటుంది. మొదటిదశలో ఆర్థికఅంశాలపై శిక్షణ ఇచ్చి, అనంతరం పరీక్ష నిర్వహిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను ఐఐఎం పర్యవేక్షిస్తుంది. ఇందులో భాగంగా మార్కెట్ ఫంక్షనింగ్, రిస్క్, రిటర్న్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా స్టాక్‌మార్కెట్, బాండ్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఫారెన్ ఎక్స్ఛేంజ్, క్రిప్టో కరెన్సీపై అవగాహన కల్పిస్తారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టడం, లాభాలను ఆర్జించడంలో మెలకువలు తెలుస్తాయని ఏఎంఎఫ్ఐ భావిస్తోంది. తద్వారా భవిష్యత్తులో మనదేశం బలమైన ఆర్థికవ్యవస్థగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వచ్చే నెల 13 నుంచి అధ్యాపకులకు శిక్షణ ప్రారంభిస్తామని ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు. దీనివల్ల సురక్షితమైన పెట్టుబడులు పెట్టే మార్గాలు తెలుస్తాయని ఫైనాన్షియల్ లిటరీ ప్రోగ్రామ్ ఫర్ డిగ్రీ కాలేజీ స్టూడెంట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విజయభాస్కర్ మారిశెట్టి తెలిపారు. ఏటా20వేల మంది విద్యార్థులకు శిక్షణ అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు.

‘ఆశా’లను పర్మనెంట్ చేయాలి

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సుబ్బారావు, ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు పోచమ్మ, పి.ధనశ్రీ, డి.సుధారాణి, సీఐటీయూ జిల్లా ప్రతినిధులు వీవీ శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వానరమూకతో బెంబేలు

... 5వ పేజీ తరువాయి

అటవీ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇటీవల పట్టణంలో పర్యటించిన సందర్భంగా కోతులు అధికంగా వుండడాన్ని గమనించారు. వీటి సమస్య లేకుండా చూడాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కానీ ఇంతవరకు వారిలో కదలిక లేదు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

గ్రామాల్లో సేవా కార్యక్రమాలకు చేయూత

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థలకు చేయూతను అందిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో ఆదివారం ఉరుకుటి పెదరామునాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన, నేత్ర చికిత్సా శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 150 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి కొంత మందికి ఆపరేషన్లు అవసమని గుర్తించారు. రక్తదాన శిబిరంలో పలువురు యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాదర్, ట్రస్ట్ చైర్మన్ ఉరుకుటి శ్రీనివాస్, సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుటి రమణ, పార్టీ మండల అధ్యక్షుడు మత్స్యరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డాదిలో ప్రత్యేక వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బత్తుల తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు రోగులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వైద్యులు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. 200 మందికి వైద్యులు బలగా శ్రీనివాస్, ఇందిరా, జీవి చాందిని వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేశ్, నాయకులు వడ్డి సత్యారావు, దొండా రమేశ్, కె. గురుమూర్తి, కనక, తలారి శంకర్ పాల్గొన్నారు.

పెదబొడ్డేపల్లిలో...



వైద్య శిబిరం జరుగుతున్న రోగులకు మందులు రాస్తున్న వైద్యులు

నర్సీపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పెదబొడ్డేపల్లి 11వ వార్డు థెరెసా కాలనీలో షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రుత్తల రవికృష్ణ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 250 మంది వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్, కార్యదర్శి బేతిరెడ్డి విజయ్, ట్రెజరర్ నక్క సుధీర్ కుమార్, సభ్యుడు కర్రి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాగారాల గెడ్డ గండి పూడ్చివేత



జి.కోడూరు పూర్తయిన గండి పూడ్చివేత పనులు

మాకవరపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలతో జాగారాల గెడ్డ ఉధృతికి దెబ్బతిన్నచోట గండి పూడ్చివేత పనులు పూర్తిచేశారు. మొంథాన్ తుఫాన్‌కు ఆయకట్టు కింద నున్న జి.కోడూరు గ్రామంలోని వరి చేలు పూర్తిగా నీటమునిగాయి. దీంతో తాత్కాలికంగా ముందుగా గండి పనులు పూర్తిచేయాలని అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పనులు పూర్తి చేశారు. గండి వద్ద శాశ్వత గట్టు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. గత మూడేళ్లుగా గండి పనులు పూర్తి చేయకపోవడంతో వరిసాగు నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రహదారి పక్కన తుప్పల తొలగింపు



సీతంపేట-కాశీపురం రోడ్డులో తుప్పలు తొలగిస్తున్న యువకులు

దేవరాపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతంపేట-కాశీపురం మార్గంలో ఇరువైపులా తుప్పలను నాగయ్యపట, సీతంపేట యువత స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం తొలగించారు. ఈ మార్గంలో కాశీపురం, నాగయ్యపేట, తామరబ్బ, చింతలపూడి పంచాయతీ ప్రజలు దేవరాపల్లికి నిత్యావసరాలు, ఇతర అవసరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అనంతగిరి మండలంలోని నాలుగు పంచాయతీల ప్రజలకు ఇదే దగ్గర మార్గం. వీరందరికీ ఉపయోగపడే రహదారి శుభ్రపరచడంపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

విద్యుత్ లైన్ల పేరిట ఇష్టానుసారంగా నరికివేత

వ్యతిరేకిస్తున్న జనాలు.. పట్టించుకోని అధికారులు



రావికమతం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటండి.. వాటిని రక్షించండి.. పర్యావరణాన్ని కాపాడండి.. ఇదీ ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు అధికారులు చేస్తున్న ప్రచారం. దీన్ని పక్కడనబెడిత, మొక్కలు నాటడం తర్వాతే.. పెరిగిన చెట్లపై గొడ్డలి వేటు పడుతున్నా వారు చలించకపోవడం విడ్డూరం. విద్యుత్ లైన్ల మరమ్మతుల పేరుతో రహదారుల పక్కన చెట్లను యథేచ్ఛగా నరుకుతున్నా, అధికారులు కనీసం పట్టించుకోకపోవడాన్ని జనాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో రహదారులకు ఇరువైపులా లక్షలాది రూపాయలు వెచ్చించి పెంచిన చెట్లను విద్యుత్ శాఖ తొలగిస్తుండడంపై పలువురు



రావికమతం-చినపాచిల రహదారిలో చెట్లను నరికేసిన దృశ్యం

అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. కొత్తగా విద్యుత్ లైన్లను రహదారులను ఆనుకుని వేస్తున్నారు. రోడ్లకు అడ్డంగా ఉన్నాయనే సాకుతో ఇరువైపులా ఉన్న చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది యంత్రాలతో తొలగిస్తున్నారు. రావికమతం నుంచి చిన పాచిల లైన్, గొంప జంక్షన్ నుంచి గొంప గ్రామం వరకు, రావికమతం పాతాళ వారి పొలాల నుంచి రావికమతం అద్దెపల్లి గెడ్డ వద్ద నూతనంగా ఏర్పాటు చేసే పెట్రోల్ బంకు వరకు విద్యుత్ లైన్ కోసం రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. సామాన్య రైతులు సొంత భూముల్లో చెట్లను అవసరం నిమిత్తం తొలగిస్తే.. వాల్టా చట్టమంటూ వేధింపులనకు గురిచేసే రెవెన్యూ, ఫారెస్ట్ శాఖ అధికారులు విద్యుత్ శాఖపై ఎందుకు మిన్నకుంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంలేక వేలాది రూపాయలు ఈ విధంగా దుర్వినియోగమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. చెట్ల నరికివేతతో పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది.

బీసీ కాలనీలో 'చెత్త' వాతావరణం

» రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

మాకవరపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో చెత్త వాతావరణం నెలకొంది. ఈ కాలనీ రహదారి పక్కన వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. కాలనీ వాసులు చెత్తాచెదారాన్ని ఈ రోడ్డుపైనే వేయడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. వ్యర్థాలు కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ముక్కుమూసుకొని ఇళ్లల్లోకి వెళ్లాల్సి వస్తున్నదని పలువురు కాలనీ వాసులు వాపోతున్నారు. స్వచ్ఛ భారత్-స్వచ్ఛాంధ్ర అంటూ అధికారులు చేస్తున్న ప్రకటనలు కార్యాలయాలకే పరిమితవుతున్నాయని వారు మండిపడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వైఖరితో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అసలే జర్వాల సీజన్ కావడంతో ఈ చెత్త వల్ల ఎప్పుడు ఎటువంటి రోగాలు వస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఇక్కడ చెత్తను



మాకవరపాలెం బీసీ కాలనీలోని ప్రధార రహదారిపైనే చెత్త కుప్పలు

తొలగించి పారిశుధ్యం మెరుగుపర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అధ్వానంగా దేవరాపల్లి-వాలాబు రోడ్డు

దేవరాపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి-వాలాబు రహదారి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో అడుగడుగునా గోతులు పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. వాలాబు పంచాయతీలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సుమారు రూ.9 కోట్లతో శివారు గ్రామాలకు సిమ్మెంటు రోడ్లు వేశారు. అయితే దేవరాపల్లి నుంచి వాలాబు 15 కిలోమీటర్లు కాగా, ఈ రోడ్డు శ్రీరాంపురం, గంగవరం, వాలాబు సమీపంలో పలు చోట్ల గోతులు పడ్డాయి. వాలాబు పంచాయతీతో పాటు రైవాడ పంచాయతీలోని శ్రీరాంపురం, అనంతగిరి మండలం జీనబాడుకు చెందిన బెంటి, సరియా వాటర్ పాల్స్‌కు, మాకనాపల్లి, గ్రామాలకు ఇదే మార్గంగా వెళ్లాలి. ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరమంగా మారిందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డును మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.



దేవరాపల్లి-వాలాబు రహదారి మధ్యలో పడిన భారీ గోతులు

ఇలా వదలేస్తే ఎలా..?

» నిరుపయోగంగా రైతు సేవా కేంద్ర భవనం



నిరుపయోగంగా ఉన్న రైతు సేవా కేంద్ర భవనం

నాతవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమ్మచింత గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు సేవా కేంద్రం భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. ఏడాది కాలంగా దీన్ని ప్రారంభించకుండా వదిలివేస్తే ఎలా అని చమ్మచింత గ్రామ రైతులు ప్రశ్నిస్తున్నారు. పూర్తయిన భవనాన్ని ప్రారంభించడానికి కూడా అధికారులకు తీరిక లేదా అని మండిపడుతున్నారు. దీంతో కొత్త భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని ఉపయోగించకపోతే తలుపులు, ఇతర వస్తువులు పాడైపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

కార్తీక వన సమారాధన

నాతవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోటమ్మతల్లి వనంలో ఆదివారం కార్తీక వన సమారాధన ఏర్పాటు చేశారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కోటమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భోజనాలు చేసి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో టీడీపీ శ్రేణులు ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నాతవరం పీఏసీఎస్ చైర్మన్ అప్పిరెడ్డి మాణిక్యం, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, తాండవ కమిటీ సభ్యుడు పారుపల్లి దాసు, తెలుగు యువత నేత పోలుపర్తి సాయి, మన్యపురట్ల నీటి సంఘం అధ్యక్షుడు అప్పన దివాణం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో తిప్పలు

మాకవరపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని తాడపాల దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా మధ్యలో స్తంభాలు ఉండటంతో పాటు రోడ్డును తుప్పలు ఆక్రమంచాయి. దీంతో కాలనీలోకి చిన్న చిన్న వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి దాపురించింది. సమస్య తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్న ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



తాడపాల రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

నర్సీపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం సెలవు దినం కలిసి రావడంతో కథలు, జీకే పుస్తకాలు చదువుతూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి దమమంతి మాట్లాడుతూ నవంబరు 14 నుంచి జరగనున్న గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని పాఠకులకు పిలుపునిచ్చారు.



కథల పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

సత్యసాయి అఖండ నామ సంకీర్తన

దేవరాపల్లి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): సత్య సాయిబాబా ప్రపంచ వ్యాప్త అఖండ నామ సంకీర్తన స్థానిక సత్యసాయి బాబా జ్ఞాన మందిరంలో ఆదివారం నిర్వహించారు. సత్యసాయి బాబా సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 24 గంటలు అత్యంత భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం చేపట్టారు. జోనల్ ఇన్‌చార్జి సీహెచ్‌వీ రవిశంకర్, స్వామినాయుడు, జగన్నాథం,ధం, పెంటారావు, వెంకటపతి, రమామణి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో పర్యాటకుల సందడి

కృష్ణాదేవిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. అనకాపల్లి, అల్లూరి, విశాఖపట్నం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు పార్కుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా పార్కులో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులను సందర్శించి, నివాళులు అర్పించారు. ఇక్కడ అందాలను, ప్రకృతి సౌందర్యాలను పర్యాటకులు తిలకించి ఆనందంగా గడిపారు. అనంతరం వన భోజనాలు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే పర్యాటకులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పర్యాటకులతో కిక్కిరిసిపోయిన అల్లూరి పార్కు

వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

» బీజేపీ రాష్ట్ర నేత గాదె శ్రీనివాసరావు

నాతవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కూటమి నాయకులు తిప్పి కొట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గాదె శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని గునుపూడి ఆదివారం బీజేపీ జెండాను స్థానిక నాయకులతో కలసి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటా కార్యకర్తలు బీజేపీ జెండా ఎగిరేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సబ్బీ కుమార్, నాయకులు లాలం వెంకటరమణ, అడిగర్ల సతీశ్, పేరూరి బుల్లిదొర, గవిరెడ్డి త్రినాథ్, మురళి, సతీశ్, శివాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నర్సీపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవంలో భాగంగా సీనియర్, జూనియర్స్ విభాగాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ భాష ప్రాముఖ్యతపై పోటీలు ఏర్పాటు చేశారు. ఏడు మండలాల్లో 23 పాఠశాలల నుంచి జూనియర్ విభాగంలో 65 మంది, సీనియర్స్ విభాగంలో 248 మంది హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా కోట ప్రసాద్, తోట ప్రసాద్ వ్యవహరించారు. నవంబరు 14న సిటీ క్లబ్‌లో నిర్వహించే బాలల దినోత్సవం కార్యక్రమంలో బాలలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఘనంగా కార్తీక మాస పూజలు

మాడుగుల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేకువజామున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు ఏర్పాట్లు చేశారు.

మెకానిక్‌ల వన భోజన వేడుకలు

నర్సీపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వరసిద్ధి మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తర వాహినీ వద్ద వన భోజన వేడుకలు నిర్వహించారు. పిక్నిక్ సందర్భంగా కుటుంబ సమేతంగా సామూహిక వన భోజనాలు చేశారు. సీఐటీయూ నాయకుడు రాజు మాట్లాడుతూ మెకానిక్‌లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

రోలుగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ యోచనకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో ఆదివారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ ఆట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే ప్రయత్నం ఓ దుర్మార్గ విధానమన్నారు. ప్రజల నిబద్ధతను నిరూపించేందుకు కోటి మంది సంతకాల రూపంలో అభిప్రాయాన్ని గవర్నర్‌కు అందజేస్తామన్నారు. అలాగే అన్ని సామాజిక వర్గాల కమిటీలను బలోపేతం చేయాలని, త్వరలోనే వారికి గుర్తింపు కార్డులు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పోతల శ్రీనివాసరావు, అప్పలనాయుడు, టి.వెంకటరమణ, చెట్టుపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువతి ఆత్మహత్యాయత్నం

» ప్రియుడితో పెళ్లి చేయలేదనే మనస్తాపం

» ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు

గాజువాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వాడితో పోలీసులు పెళ్లి చేయలేదనే మనస్తాపంతో ఓ యువతి గాజువాక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి చెందిన యువతి, అనకాపల్లికి చెందిన వీరయ్యస్వామి అచ్చుతాపురంలోని ఓ సంస్థలో పనిచేసేవారు. ఈ క్రమంలో వారిద్దరిమధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. కొంతకాలం తరువాత యువతి అచ్చుతాపురంలో పని మానేసి గాజువాకలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తూ శ్రీనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఏడేళ్ల పాటు కలిసి తిరిగిన వీరయ్యస్వామి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో పది రోజుల కిందట గాజువాక పోలీసులను ఆశ్రయించింది. దీనిపై ఆదివారం పోలీసులు ఇద్దరినీ పిలిపించారు. ఈ క్రమంలో యువతి వీరాస్వామితో తనకు పెళ్లి చేయాలని పట్టుబట్టింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తుండగానే హ్యాండ్‌బ్యాగ్‌లోని నెయిల్ పాలిష్ తీసుకుని తాగేసింది. వెంటనే పోలీసులు ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాజువాక సీఐ ఎ.పార్థసారధి ఆస్పత్రికి వెళ్లి యువతిని విచారించారు. అయితే ప్రియుడిపై ఫిర్యాదు చేయడానికి ఆమె నిరాకరించి, పెళ్లి చేయాలని మాత్రమే పట్టుబడుతుండడంతో వీరయ్యస్వామితో చర్చిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589